# నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

**జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి**

బాన్సువాడ రూరల్, జూన్ 27 : ఎరువుల దుకాణాల్లో వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొని, దుకాణం లైసెన్స్‌ను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి హెచ్చరించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో ఎరువుల దుకాణాలను ఆమె గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో విక్రయిస్తున్న విత్తనాలు, ఎరువుల వివరాలను అడిగి తెలుసుకొని స్టాక్ రికార్డులను పరిశీలించారు. కొల్లూరు గ్రామంలోని పీఏసీఎస్ గోదాంను తనిఖీలు చేసి స్టాక్ రిజిస్ట్రర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులను మోసం చేసే విధంగా నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఈవోలు మీనా, రాణిలు ఉన్నారు.



బోర్లంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారిణి భాగ్యలక్ష్మి

## బీఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కులు అందజేత



బాధితులకు బీమా చెక్కులను అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

కామారెడ్డి, జూన్ 27 : జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ నివాసంలో బీఆర్ఎస్ ప్రమాద బీమా చెక్కులను గురువారం బాధితులకు అందజేశారు. కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్‌కు చెందిన నవ్య మృతి చెందగా ఆమె భర్త స్వామి గౌడ్‌కు, బీబీపేట మండలం యాడారం గ్రామానికి చెందిన ఆరేటి వడ్ల సంగమేశ్వర్ మృతి చెందగా అతని భార్య ఆరేటి స్వప్నకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల చొప్పున రూ.4 లక్షల బీఆర్ఎస్ సభ్యత్వ బీమా నుంచి మంజూరైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా గంపగోవర్ధన్ మాట్లాడుతూ.. కార్యకర్తలకు ఎల్లప్పుడు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాలనే మంచి ఉద్దేశంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రమాద బీమా చేయించారన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, ఎంపీపీ బాలమణి, పార్టీ నాయకులు బల్వంత్‌రావు, రమేశ్, భూంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కారు అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిలిమ్‌ను తొలగించాలి



బ్లాక్ ఫిలిమ్‌ను తొలగిస్తున్న పోలీసు సిబ్బంది

భిక్కనూరు, జూన్ 27 : భిక్కనూరు టోల్ గెట్ వద్ద కామారెడ్డి జిల్లా రవాణాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కారు అద్దాలకు ఉన్న బ్లాక్ ఫిలిమ్‌ను తొలగించారు. లైసెన్స్ లేని వాహనలపై కేసులు నమోదు చేసి జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం కారు అద్దాలకు వేసిన బ్లాక్ ఫిలిమ్‌ను వెంటనే తొలగించాలని, డ్రైవర్ సీటు బెల్టు ధరించి కారును నడపాలని సూచించారు.

**వాహనాల తనిఖీ**

పెద్దకొడప్‌గల్, జూన్ 27: పెద్దకొడప్‌గల్ మండలంలోని బేగంపూర్ చౌరస్తా వద్ద 161జాతీయ రహదారిపై పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాస్, రవి తదితరులు పాల్గొన్నారు.

## లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

భిక్కనూరు,జూన్ 27: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్టరీత్యా నేరమని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ శిరీష అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే జిల్లా మిషన్ శక్తి మహిళా సాధికారత కేంద్రంలో వంద రోజులు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని భిక్కనూరు ప్రభుత్వ దవాఖానలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు నివారించాలని, శిశువులను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసినందుకు, సహకరించిన వారిపై చర్యలు తప్పవన్నారు. మహిళా సాధికార కేంద్రం సిబ్బంది శారద, సౌందర్య, డాక్టర్ హేమీమా, స్టాఫ్‌నర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్‌కు సన్మానం



ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న జంగంపల్లి గ్రామస్తులు

భిక్కనూరు, జూన్ 27 : మండలంలోని జంగంపల్లిలో ఉన్న మహాత్మా జ్యోతి బాపులే పాఠశాల ప్రిన్సిపాల్(ప్రత్యేక అధికారిణి) మణిదిప్తి ఉద్యోగోన్నతిపై బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆమెను పాఠశాలలో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో గ్రామస్తులు అత్తెలి శ్రీనివాస్, పుల్లూరి శివలింగం, సీహెచ్ మోహన్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, రాములు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నూతన చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్

కామారెడ్డి, జూన్ 27 : జూలై 1వ తేదీ నుంచి దేశ వ్యాప్తంగా కొత్త చట్టాలను అమలు చేస్తూ భారత ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి కొత్త చట్టాలను అనుసరిస్తూ ముందుకు సాగాల్సి ఉంటుందన్నారు. కొత్త చట్టాల గురించి ప్రతి ఒక్క అధికారి, సిబ్బందికి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా జిల్లా పోలీసులందరికీ విడుతల వారీగా శిక్షణ తరగతులను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో రూరల్ సీఐ రామన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## బస్వన్నపల్లిలో వైద్యశిబిరం

రాజంపేట్, జూన్ 27 : మండలంలోని బస్వన్నపల్లి గ్రామంలో ఉన్న రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కామారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన వారికి వైద్య పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, రాష్ట్ర సభ్యుడు సంజీవరెడ్డి, సెక్రటరీ రఘుకుమార్, కరస్పాండెంట్ డాక్టర్ నరసింహ, జిల్లా హెల్త్ కోఆర్డినేటర్ డాక్టర్ విక్రమ్‌కుమార్, మండల చైర్మన్ హరినాథ్, జిల్లా సభ్యులు యోగా రాంరెడ్డి, గంగారెడ్డి, రమేశ్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన వృద్ధులు

## కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కామారెడ్డి, జూన్ 27 : జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తాలో ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్ పేపర్ లీకేజీకి పాల్పడిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సుమారు 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారిందని అన్నారు. పేపర్ లీకేజీ వ్యవహారంలో ఒక్కో అభ్యర్థి నుంచి సుమారు రూ.30 లక్షల వరకు వసూళ్లకు పాల్పడ్డారని తెలిపారు. ఈ వ్యవహారంలో సుప్రీం కోర్టు జడ్జితో సమగ్ర విచారణ జరిపించి బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు నీల నాగరాజు, జబ్బర్ నాయక్, కుంబాల లక్ష్మణ్ యాదవ్, సతీశ్, వినోద్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## బస్‌పాస్ కోసం విద్యార్థుల అవస్థలు



బస్‌పాస్ కోసం వేచిఉన్న విద్యార్థులు

కామారెడ్డి, జూన్ 27 : రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు బస్‌పాస్ కోసం బస్టాండ్‌లో పడిగాపులు కాస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ఒక్కటే బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేయడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్‌పాస్ కౌంటర్ వద్ద తక్కువ స్థలం ఉండడం, కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులు చాలా సేపు ఎదురుచూడాల్సి వస్తున్నది. కనీసం విద్యార్థులకు మరో అదనపు బస్‌పాస్ కౌంటర్ ఏర్పాటు చేస్తే బాగుటుందని విద్యార్థులు వాపోతున్నారు.

## విద్యా హక్కు చట్టం అమలు చేయాలి

భిక్కనూరు, జూన్ 27 : విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి శంకర్ అన్నారు. భిక్కనూరులో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్న అధిక ఫీజులు కట్టడి చేసేలా ప్రైవేటు పాఠశాలల యాజమాన్యంతో సమావేశం నిర్వహించి తగు ఆదేశాలు ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నాగభూషణం, లక్ష్మన్, రామస్వామి, నారాయణ, బసవరాజు, సారయ్య, మండల నాయకులు పాల్గొన్నారు.

## చెట్లకు నీటిని అందించాలి

కామారెడ్డి, జూన్ 27 : జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో ఉన్న ప్రకృతి వనాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులు ఎప్పటికప్పుడూ చెట్లకు నీళ్లు అందేలా చూడాలన్నారు. చుట్టు పక్కల శుభ్రంగా ఉంచాలని కార్మికులకు సూచించారు. అనంతరం పట్టణంలోని బుర్క మత్తడి కాలువ, తాగునీటి కాలువను పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు పాత శివ కృష్ణమూర్తి, నజీరుద్దీన్, మహ్మద్ అంజద్, మమత, సాయిబాబా, ఇమ్రాన్ మొయినుద్దీర్, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

## ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



చిన్నారికి మాత్ర వేస్తున్న వైద్యసిబ్బంది

నాగిరెడ్డిపేట, జూన్ 27: మండలంలో గురువారం రెండో విడుత ఆల్బెండజోల్ మాత్రల పంపిణీని చేపట్టినట్లు వైద్యాధికారి సృజన్‌కుమార్ తెలిపారు. మండలంలో మొత్తం 6,647మంది 19ఏండ్లలోపు వారు ఉండగా.. ఈనెల 20వ తేదీన 5,916మందికి మాత్రలు వేశామని తెలిపారు. మిగిలిన 731మందికిగాను గురువారం 724మందికి వేశామని, దీంతో 99శాతం లక్ష్యం పూర్తి అయ్యిందని తెలిపారు.

# ఈజీఎస్ భవనంలోకి మండల పరిషత్ కార్యాలయం

**శిథిలావస్థకు చేరడంతో భయంతో మార్చిన అధికారులు**

నాగిరెడ్డిపేట, జూన్ 27: నాగిరెడ్డిపేట మండల పరిషత్ భవనం శిథిలావస్థకు చేరుకున్నది. మరమ్మతులు చేయించకపోవడంతో అధికారులు ప్రాణభయంతో కార్యాలయానికి తాళం వేశారు. మండల పరిషత్ భవనం పక్కనే ఉన్న ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ప్రస్తుతం విధులను నిర్వహిస్తున్నారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ భవనాన్ని అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 1987వ సంవత్సరంలో నిర్మించారు. భవనం నిర్మించి 37ఏండ్లు గడుస్తున్నది. మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నది. చిన్నపాటి వర్షం కురిసినా.. పైకప్పు పెచ్చులూడి అధికారులకు గాయాలవుతున్నాయి. మరమ్మతులు చేపట్టాలని నివేదికలు పంపినా.. నిధులు మంజూరు కావడం లేదు. ప్రస్తుతం వానకాలం ప్రారంభం కావడంతో కార్యాలయంలో పనిచేయాలంటేనే భయంగా ఉన్నదని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. దీంతో కార్యాలయానికి తాళం వేసి పక్కనే ఉన్న ఉపాధి హామీ కార్యాలయంలోకి మారినట్లు ఎంపీడీవో పర్బన్న తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలని లేదా దానిని పూర్తిగా కూల్చివేసి కొత్త భవనాన్ని నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



నాగిరెడ్డిపేటలో మండల పరిషత్ కార్యాలయ భవనం, కార్యాలయం వెనుక భవనంలోకి మార్చినట్లు అతికించిన పేపర్

## నేడు లింగంపేటలో మెగా వైద్య శిబిరం

లింగంపేట, జూన్27: లింగంపేటలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న వైద్యశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు రెడ్ క్రాస్ సొసైటీ ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు సంగన్నగారి రవీందర్‌గౌడ్ గురువారం తెలిపారు. మెగా వైద్య శిబిరంలో దివ్యాంగులు, 60 సంవత్సరాలు పైబడిన వారికి ప్రత్యేక పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## రేపు ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 27: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కామారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ దవాఖాన వద్ద మెగా ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎల్లారెడ్డి మండల శాఖ బాధ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మొబైల్ మెడికల్ యూనిట్ ఆధ్వర్యంలో ఈసీజీ, నేత్ర, దంత, రక్త పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. పట్టణంతోపాటు మండల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## రేపు గాంధారి తైబజార్ వేలం

గాంధారి, జూన్ 27: గాంధారి వారాంతపు, పశువుల సంతకు 29న శనివారం తైబజార్ వేలాన్ని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి నాగరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార సంత వేలంలో పాల్గొనే వారు రూ.లక్ష, పశువుల సంత వేలంలో పాల్గొనే వారు రూ.25 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. వేలంలో పాల్గొనే ఆసక్తి ఉన్న గ్రామ పంచాయతీ కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలని సూచించారు.

## రక్త నమూనాల సేకరణ

లింగంపేట, జూన్ 27: లింగంపేట మండల కేంద్రానికి చెందిన పోకల సాయికృష్ణ, పోకల సాయిరాం నుంచి రక్త నమూనాలు సేకరించినట్లు మండల వైద్యాధికారిణి హిమబిందు గురువారం తెలిపారు. సాయికృష్ణ విష జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న వైద్య సిబ్బంది గురువారం వారి ఇంటికి వెళ్లి రక్త నమూనాలు సేకరించారు. సాయికృష్ణ ఇంటి పక్కన ఉన్న గృహాలను సందర్శించి వివరాలు సేకరించారు.

## భూసార పరీక్షలకు రామారెడ్డి ఎంపిక

రామారెడ్డి, జూన్ 27: భూసార పరీక్షకు రామారెడ్డి మండలం పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైందని మండల వ్యవసాయాధికారి ప్రజాపతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రెండు వేల భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

# ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు దైవ సమానులు

**ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు**

ఎల్లారెడ్డి, జూన్ 27: ప్రజల ప్రాణాలను కాపాడే వైద్యులు దైవ సమానులని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని అడ్విలింగాల గేటు సమీపంలో ఏదా వర్షిప్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఆరోగ్యం అన్నింటికంటే ప్రధానమైనదని, దానిని కాపాడుకోవాలని సూచించారు. హెల్త్ ఫౌండేషన్, ఇండియా మెడికల్ మిషన్ వారు సంయుక్తంగా ఏర్పాటుచేసిన ఈ శిబిరంలో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. శిబిరంలో బల్దియా చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ సామెల్, ఏదా వర్షిప్ సెంటర్ నిర్వాహకులు శ్రీనివాసాచారి, హెప్సిబాచారి తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు

# యూనిఫామ్‌లను త్వరగా అందజేయాలి

**డీఆర్డీవో చందర్‌నాయక్.. రామారెడ్డి ఐకేపీ కార్యాలయం సందర్శన**

రామారెడ్డి, జూన్ 27: యూనిఫామ్‌లను త్వరగా కుట్టి విద్యార్థులకు అందజేయాలని డీఆర్డీవో చందర్‌నాయక్ అన్నారు. రామారెడ్డి మండలంలో ఆయన గురువారం పర్యటించారు. రామారెడ్డిలోని ఐకేపీ కార్యాలయంలో యూనిఫామ్‌లు కుట్టేందుకు వచ్చిన మెటీరియల్‌ను పరిశీలించారు. వీలైంతన తొందరగా కుట్టేలా చూడాలని సీఏలకు ఆదేశించారు. అంతకుముందు ఆయన గొల్లపల్లి గ్రామంలో చేపడుతున్న ఫాంపాండ్ పనులను పరిశీలించారు. ఆయనవెంట ఎంపీడీవో సవితారెడ్డి, ఏపీవో ధర్మారెడ్డి, ఏపీఎం ప్రసన్నకుమార్, పంచాయతీ కార్యదర్శులు క్రాంతికుమార్, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.



గొల్లపల్లిలో ఫాంపాండ్ పనులను పరిశీలిస్తున్న డీఆర్డీవో

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED TEACHERS

★Wanted Teachers to Teach Telugu, Hindi, English, Maths, Physics, Biology and Social Note: Wanted Lady Accountant, Little Heart High School, Namdevwada, Nzb. Nursery to X Std. Contact No. 8309582476

NTZ-324943

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

## స.హ. చట్టం.. వజ్రాయుధం

నాగిరెడ్డిపేట, జూన్ 27: సమాచార హక్కు చట్టం సామాన్య మనువుడికి వజ్రాయుధం వంటిదని స.హ. చట్టం రాష్ట్ర డైరెక్టర్ సలీమ్ అన్నారు. మండల కేంద్రంలోని సిద్ధార్థ కళాశాల విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహన కల్పించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో నిధులు, సౌకర్యాలు, ఖర్చుల వివరాలను తెలుసుకోవాలనుకుంటే సంబంధిత శాఖలో స.హ. చట్టం దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజుల్లో సమాచారం ఇవ్వాలని లేని పక్షంలో వారిపై కోర్టుకు వెళ్ల వచ్చన్నారు. తప్పుడు సమాచారం అందిస్తే.. వారికి రూ.25వేల వరకు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మన్మోహన్‌రెడ్డి, స.హ.చట్టం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెగ్గల రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాహిల్‌ఖాన్, జిల్లా సభ్యులు లింగమయ్య, మదర్‌పాషా, శ్రీనివాస్, బేర్జాన బేగం తదితరులు పాల్గొన్నారు.

## గాంధారిలో భారీ వర్షం

గాంధారి, జూన్ 27: మండల కేంద్రంతోపాటు, చుట్టు పక్కల గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన వర్షం సుమారు గంట సేపు ఏకదాటిగా కురిసింది. వానకాలం ప్రారంభమైన 15 రోజులకు భారీ వర్షం కురియడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజుల క్రితం కురిసిన వర్షానికి మండలంలోని అన్ని గ్రామాల్లో రైతులు మక్కజొన్న, సోయా, పత్తి, కంది తదితర పంటలను విత్తుకున్నారు. విత్తనాలు విత్తుకున్న ఐదారు రోజులు గడుస్తున్నా వానలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. విత్తనాలు మొలకెత్తడానికి బోరుబావులు ఉన్న రైతులు స్ప్రిక్లర్ల సాయంతో భూములను తడిపారు. ఈ తరుణంలో వరుణుడు కరుణించి గురువారం భారీ వర్షం కురిపించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కురిసిన వర్షంతో విత్తనాలు మొలకెత్తుతాయని రైతులు సంబురపడుతున్నారు.



గాంధారిలో కురుస్తున్న వర్షం

## భూములు సిద్ధం

డోంగ్లీ, జూన్ 27: వానకాలం పంటలు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. డోంగ్లీ మండలంలోని చిన్న టాక్లీ, పెద్ద టాక్లీ, సిర్‌పూర్ తదితర గ్రామాల్లో భూములను విత్తనాలు చల్లేందుకు సిద్ధం చేసిపెట్టారు.



## అప్పుల బాధతో ఆత్మహత్య

నాగిరెడ్డిపేట, జూన్ 27: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని బంజారా తండాలో గురువారం చోటుచేసుకున్నది. స్థానికులు, ఎస్సై రాజు తెలిపిన ప్రకారం.. తండాకు చెందిన దరావత్ శంకర్(50) ఇద్దరు కూతుళ్లు వినోద, స్వరూప, కుమారుడు సర్దార్ ఉన్నారు. వారందరికీ వివాహం చేయడంతో అప్పులు పెరిగాయి. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన అతడు గురువారం మధ్యాహ్నం సొంత గుడిసెలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సంచాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఐలాపూర్‌లో వన భోజనాలు

లింగంపేట, జూన్ 27: మండలంలోని ఐలాపూర్ గ్రామ కుర్మ సంఘం సభ్యులు గురువారం వన భోజనాలకు తరలివెళ్లారు. సంప్రదాయబద్ధంగా డోలు వాయిస్తూ మండల కేంద్రంలోని మత్తడి పోచమ్మ ఆలయం వరకు ర్యాలీ తీశారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడీపంటలు చల్లంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం వన భోజనాలు చేశారు. కార్యక్రమంలో కుర్మ కులస్తులు సంగయ్య, భైరయ్య, గుడ్ల సాయిలు తదితరులు పాల్గొన్నారు.



వనభోజనాలను తరలివెళ్తున్న ఐలాపూర్ గ్రామస్తులు